


గుర్రం జాషువాకు నివాళి

పట్నంబజారు: ఆనందపేటలోని శ్మశానవాటిక లోని గుర్రం జాషువా సమాధి వద్ద వైఎస్సార్ సీపీ నాయకులు అంబటి రాంబాబు, షేక్ నూరి ఫాతిమా శుక్రవారం నివాళులర్పించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 515.00 అడుగుల వద్ద ఉంది. ఇది 140.3150 టీఎంసీలకు సమానం.



దుర్గమ్మకు బంగారు హారం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు విస్సన్నపేటకు చెందిన భక్తులు శుక్రవారం బంగారు హారాన్ని కానుకగా సమర్పించారు.

న్యూస్‌రీల్

ప్రధాని పర్యటన ఏర్పాట్ల పరిశీలన



తాడికొండ: మే 2న వివిధ కార్యక్రమాల ప్రారంభోత్సవానికి హాజరుకానున్న ప్రధాన మంత్రి మోదీ బహిరంగ సభ ఏర్పాట్లను శుక్రవారం కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్ కుమార్, జేసీ భార్గవ్‌తేజ తదితరులు పరిశీలించారు.

డాక్టరేట్ పొందిన ఆటో డ్రైవర్ శంకర్‌రావుకు అభినందనలు



లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూనే కాలికట్ యూనివర్సిటీ ఎకనామిక్స్‌లో డాక్టరేట్ పొందిన గండికోట శంకర్‌రావును ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐఆర్‌టిడబ్ల్యూఎఫ్) అఖిల భారత ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య సత్కరించారు. శుక్రవారం స్థానిక పాతగుంటూరులోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో సంఘ జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు అధ్యక్షతన అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా ఆర్ లక్ష్మయ్య మాట్లాడుతూ గండికోట శంకరరావు ఆటో డ్రైవర్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా, ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి కె.దుర్గారావు, నాయకులు పాల్గొన్నారు.

21న చీరాలలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

బాపట్ల: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని చీరాల మున్సిపల్ కార్యాలయంలో ఈనెల 21వ తేదీన నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రజల సౌలభ్యం కోసం చీరాల నియోజకవర్గ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహి స్తున్నట్లు తెలిపారు. చీరాల నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

చెలరేగిన మృగాడు



క్రోసూరు: స్థానిక బోయ కాలనీలో భార్యపై అనుమానం పెంచుకుని భర్త బ్లేడుతో గొంతుకోసిన సంఘటన శుక్రవారం జరిగింది. స్టేషన్ రైటర్ దాసు వివరాల ప్రకారం.. బోయ కాలనీకి చెందిన చార్ల శ్రీను భార్య మల్లమ్మ. ఆమె ఎవరితోనో ఫోనులో మాట్లాడుతుండటంతో అనుమానపడి శ్రీను బ్లేడుతో దాడి చేసి గొంతు కోశాడు. చుట్టపక్కల వారు ఆమెను సత్తెనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆమెకు వైద్యులు 25 కుట్లు వేశారు. ఆరోగ్య పరిస్థితి స్థిమితంగా ఉంది. మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించాలని వైద్యులు సూచించారు. శ్రీను, మల్లమ్మలకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహం కూడా అయింది. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు రైటర్ దాసు తెలిపారు.

పాక్ జలసంధిని ఈదిన గణేష్



విజయవాడస్పోర్ట్స్: తమిళనాడులోని ధనుష్ కోటి నుంచి శ్రీలంకలోని తలైమన్నార్ వరకు ఉన్న పాక్ జలసంధిని ఆంధ్రప్రదేశ్ పారా స్విమ్మర్ బి.గణేష్ సాహసోపేతంగా ఈదాడు. శుక్రవారం ఉదయం 5.50 గంటలకు తలైమన్నార్‌లో ఈతను ప్రారంభించి సాయంత్రం 4.20కి ధనుష్‌కోటికి చేరుకున్నారు. 28 కిలోమీటర్లు పొడవున్న సముద్రాన్ని 10.30 గంటల్లో ఈదాడు. తెలుగు రాష్ట్రాల్లోని పారా స్విమ్మర్‌లలో పాక్ జలసంధిని ఈదిన మొట్టమొదటి పారా స్విమ్మర్‌గా ఖ్యాతిగడించారు. స్విమ్మర్ గణేష్ ప్రస్తుతం ఏలూరు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థలో స్విమ్మింగ్ కోచ్‌గా పని చేస్తున్నాడు.

సిలువపై రుధిర గీతం







లోక పాప పరిహార్థం సిలువపై రక్తం చిందించిన క్రీస్తు తన జనుల కోసం ప్రాణాలర్పించారు. దీనికి గుర్తుగా శుక్రవారం గుడ్ ఫ్రైడేను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా గుంటూరులోని పునీత ఆగ్నేసమ్మ చర్చిలో సిలువ యాత్ర, డాన్‌బాస్కో చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రైస్తవ విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొని క్రీస్తు ప్రాణత్యాగాన్ని గుర్తుచేసుకున్నారు. ఏసుక్రీస్తుకు జేజేలు పలికారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

జగనన్న పాలన సువర్ణ అక్షరం

- ప్రభుత్వ విద్యారంగానికి ఊపిరి
- మనబడి నాడు–నేడు, విద్యాకానుక, అమ్మఒడి, గోరుముద్ద కార్యక్రమాలతో ప్రగతిబాట పట్టిన ప్రభుత్వ పాఠశాలలు
- ట్యాబ్స్ పంపిణీ, ఐఎఫ్‌పీలతో డిజిటల్ విద్యాబోధనకు నాంది
- టెన్త్, ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు ద్వారా నగదు ప్రోత్సాహకాలు
- అదే బాటలో షైనింగ్ స్టార్స్ కార్యక్రమం చేపట్టిన ప్రస్తుత కూటమి సర్కారు
- ల్యాప్‌ట్యాప్‌తో సరిపెట్టిన వైనం



2023లో జిల్లాస్థాయి ఆణిముత్యాలు ప్రోత్సాహక నగదు బహుమతులు అందుకున్న విద్యార్థులతో కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, ఎమ్మెల్యే గిరిధర్ తదితరులు(ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలలకు ప్రాణం పోసిన మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తెచ్చిన చదువుల విప్లవం భావి ప్రభుత్వాలకు దారి చూపుతోంది. విద్యారంగానికి దశ, దిశ చూపిన ఆయన ముందుచూపు, పేదల చదువుల కోసం పడిన తపన చిరస్థాయిగా నిలిచింది. ప్రభుత్వ విద్యాసంస్థల నుంచి పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ప్రతిభావంతులుగా నిలిచిన విద్యార్థులను "జగనన్న ఆణిముత్యాలు" కార్యక్రమం ద్వారా నగదు ప్రోత్సాహాలతో సత్కరించాలని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న మహత్తరమైన నిర్ణయం నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. సమస్యల సుడి గుండంలో కొట్టుమిట్టాడుతున్న ప్రభుత్వ పాఠశాలలను మనబడి నాడు–నేడు ద్వారా సకల హంగులతో ఆధునీకీకరించి, పేద, మధ్య తరగతి విద్యార్థుల చదువులకు పెన్నిధిగా నిలిచిన వైఎస్ జగన్ ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు పర్చిన జగనన్న ఆణిముత్యాలు బాటలోనే ప్రస్తుత కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న షైనింగ్ స్టార్స్ రూపుదిద్దుకుంది.

టెన్త్, ఇంటర్ పరీక్షల ప్రతిభావంతుల కోసం ఆణిముత్యాలు

2003 మార్చి, ఏప్రిల్‌లో జరిగిన ఇంటర్మీడియెట్, టెన్త్ పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులతో నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయిలో ప్రతిభావంతులుగా నిలిచిన విద్యార్థులను జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం ద్వారా సత్కరించారు. గుంటూరు జిల్లాలోని నియోజకవర్గ స్థాయిలో టెన్త్‌లో 23 మంది, ఇంటర్‌లో 15 మంది విద్యార్థులకు అదే ఏడాది జూన్ నెలలో జరిగిన కార్యక్రమాల ద్వారా అప్పటి మంత్రులు, ఎమ్మెల్యేల సమక్షంలో నగదు ప్రోత్సాహకాలను పంపిణీ చేశారు. వీరితో పాటు జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల పరిధిలో ప్రతి పాఠశాల నుంచి టెన్త్‌లో తొలి మూడుస్థానాల్లో నిలిచిన విద్యార్థులను సైతం ఎంపిక చేసి, అదనంగా మరో 469 మంది విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. రాష్ట్రస్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు 2003 జూన్ 20న నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా రూ.లక్ష చొప్పున నగదు ప్రోత్సాహకాన్ని అందుకున్నారు.

జగనన్న ఆణిముత్యాలు ప్రోత్సాహకాలు ఇలా..

జిల్లాస్థాయిలో టెన్త్, ఇంటర్‌లలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థులకు వరుసగా రూ.50వేలు, రూ.30వేలు, రూ.10వేలు చొప్పున, నియోజకవర్గ స్థాయిలో తొలిమూడు స్థానాల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు వరుసగా రూ.15వేలు, రూ.10వేలు, రూ.ఐదు వేలు చొప్పున నగదు ప్రోత్సాహకాలను పంపిణీ చేశారు. వీరితోపాటు ప్రతి ఒక్క ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి ఎంపిక చేసిన తొలి ముగ్గురు విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో వరుసగా రూ.మూడువేలు, రూ.రెండువేలు, రూ.వెయ్యి చొప్పున అందజేశారు. ప్రతిభ చూపిన విద్యార్థుల తల్లిదండ్రులను, సంబంధిత హెచ్‌ఎం, ప్రిన్సిపాల్స్‌ను సైతం సన్మానించారు.

ప్రభుత్వ పాఠశాలలకు దశ, దిశ చూపిన వైఎస్ జగన్

వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనలో ప్రభుత్వ పాఠశాలలు ఊపిరిపోసుకున్నాయి. నాడు–నేడు, జగనన్న విద్యాకానుక, జగనన్న అమ్మఒడి, గోరుముద్ద కార్యక్రమాలతో ప్రగతిబాట పట్టిన ప్రభుత్వ పాఠశాలలు ఆధునిక విద్య దిశగా అడుగులు వేశాయి. 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్స్ పంపిణీతో పాటు తరగతి గదుల్లో ఐఎఫ్‌పీల ద్వారా డిజిటల్ విద్యాబోధనకు నాంది పలికారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు ట్యాబ్స్, నగదు అందించే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన తొలి సీఎంగా నిలిచిన వైఎస్ జగన్ విద్య ప్రభుత్వ బాధ్యత కాదన్న వారితోనే ప్రస్తుతం విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించేలా చేశారు.

ఇంటర్ విభాగంలో జిల్లా నుంచి ఒక్క విద్యార్థిని ఎంపిక

ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో గుంటూరులోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల నుంచి ఎంఈసీ గ్రూప్‌లో 967 మార్కులు సాధించిన గుంటూరు నగరానికి చెందిన సర్వేపల్లి రాజేశ్వరిని షైనింగ్ స్టార్ కింద ప్రభుత్వం ఎంపిక చేసి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా అభినందించింది. ఈనెల 18న ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో రాజేశ్వరికి ల్యాప్‌టాప్ అందజేశారు. గుంటూరు జిల్లా నుంచి ఒక్క విద్యార్థినినే ఎంపిక చేసి, ల్యాప్‌టాప్ అందజేసి మమ అనిపించారు



షైనింగ్ స్టార్ రాజేశ్వరి

గుంటూరులో అర్ధరాత్రి ఐజీ, ఎస్పీ తనిఖీలు



లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): అరండల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని బ్రాడీపేట నాలుగో లైన్‌లో గురువారం అర్ధరాత్రి గుంటూరు రేంజ్ ఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠీ, ఎస్పీ సతీష్ కుమార్, వెస్ట్ డీఎస్పీ కె.అరవింద్ తదితర పోలీసు అధికారులు ఆకస్మికంగా పర్యటించారు. శాంతి భద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నిబంధనలు అమలు, అసాంఘిక కార్యకలాపాల కట్టడికి పోలీస్ అధికారులు తీసుకుంటున్న చర్యలు వంటి పలు అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల రవాణా, బహిరంగ మద్యపానం వంటి కార్యకలాపాలను అరికట్టడానికి తనిఖీలు విస్తృతంగా చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు భరోసా కల్పించేలా విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని సూచించారు. తనిఖీల్లో జిల్లా వ్యాప్తంగా ఉన్న డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రికి పెరిగిన రద్దీ

విజయవాడ : వారాంతం, పండుగలు, వేసవి సెలవుల నేపథ్యంలో ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ పెరిగింది. శుక్రవారం కావడంతో తెల్లవారుజాము నుంచే పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి విచ్చేసిన యాత్రికులతో ఉదయం 7 గంటల నుంచే ఆలయ ప్రాంగణంలో క్యూలైన్లలో రద్దీ కనిపించింది. మధ్యాహ్నం 3 గంటల వరకు రద్దీ కొనసాగగా, ఆది దంపతులకు నిర్వహించిన ఆర్జిత సేవల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. నూతన వధూవరులు పెళ్లి దుస్తుల్లో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

మంగళగిరిలో మిస్సింగ్.. నంద్యాలలో హత్య..

- ఆక్టోపస్ కానిస్టేబుల్ మృతదేహం లభ్యం
- పథకం ప్రకారం హత్య చేయించిన ప్రియురాలు
- కూతురుతో కూడా సన్నిహితంగా ఉండడాన్ని సహించలేక ఘాతుకం



వెలికి తీసిన ఫారుక్ మృతదేహం



ఫారుక్ (ఫైల్ ఫొటో)

మంగళగిరి టౌన్: మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఒక కానిస్టేబుల్ కనిపించడం లేదంటూ అతని భార్య, బంధువులు ఫిర్యాదు చేశారు. మంగళగిరిలో మిస్ అయిన కానిస్టేబుల్ నంద్యాల–కడప ఘాట్‌రోడ్‌లో శుక్రవారం శవమై కనిపించాడు. సేకరించిన వివరాల మేరకు నంద్యాల జిల్లా, ఆళ్లగడ్డ మండలం, తోటకందుకూరు గ్రామానికి చెందిన ఫారుక్ (30) ఏపీఎస్పీ రెండో బెటాలియన్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. కొంతకాలంగా మంగళగిరి ఆక్టోపస్ కార్యాలయంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. మంగళగిరి పట్టణంలోనే ఉంటున్నాడు. ఏప్రిల్ 8న ట్రెనింగ్ ఉందంటూ వెళ్లిన ఫారుక్ తిరిగి రాకపోవడం, ఫోన్ స్విచ్ఛాఫ్ కావడంతో 12న భార్య బషీరున్ తన బంధువులతో కలిసి ఆక్టోపస్ కార్యాలయానికి వెళ్లింది. ఏప్రిల్ 9 నుంచి 12 వరకు ఫారుక్ సెలవు పెట్టాడని అక్కడి అధికారులు చెప్పడంతో మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో తన భర్త కనిపించడం లేదంటూ ఈనెల 14న ఫిర్యాదు చేశారు. మంగళగిరి పట్టణ పోలీసులు మిస్సింగ్‌గా కేసు నమోదు చేశారు.

పథకం ప్రకారం..

ఫారుక్‌ను హతమార్చేందుకు ఇద్దరూ పథకం పన్నారు. అతనికి ఫోన్ చేసి కొన్ని రోజులు సెలవు పెట్టుకుని రావాలని అనీష కోరింది. ఫారుక్ మంగళగిరి నుంచి నంద్యాలకు ఏప్రిల్ 8న సాయంత్రం బయలు దేరాడు. 9న అక్కడకు చేరుకున్న ఫారుక్ తనకు పరిచయమున్న వ్యక్తిని కలిశాడు. అక్కడి నుంచి బయటకు వెళ్దామంటూ ఆ వ్యక్తి మరో ఇద్దరిని తీసుకుని ఫారుక్‌తో కారులో బయలుదేరారు. మద్యం సేవించిన అనంతరం నంద్యాలలో కారులో వెళుతుండగా ఎదురు సీట్లో కూర్చున్న ఫారుక్‌ను వెనుక ఉన్న వ్యక్తి ఓ వైర్‌తో మెడకు గట్టిగా బిగించాడు. దీంతో ఊపిరి ఆడక ఫారుక్ అక్కడికక్కడే మరణించారు. ముందుగా వేసుకున్న పథకం ప్రకారం వీరు మృతదేహాన్ని ఒక కవర్‌లో చుట్టి నంద్యాల శివారు ప్రాంతంలో ఉన్న ఓ చెరువులో పడవేశారు. కొంత సమయం తరువాత వచ్చి చూడడంతో మృతదేహాన్ని కవర్‌తో చుట్టడం వల్ల చెరువులో తేలుతూ కనబడింది. మరుసటి రోజు ఎవరూ లేని సమయంలో వచ్చి ఆ మృతదేహాన్ని అక్కడి నుంచి తీసుకుని వెళ్లి నంద్యాల – కడప ఘాట్‌రోడ్‌లో ఫారెస్ట్ ప్రాంతంలో పైనుంచి కిందకు పడవేశారు. నంద్యాల సీసీఎస్ పోలీసులు అనీషను, మరో ఇద్దరు యువకుల్ని అదుపులోకి తీసుకోగా, మరో యువకుడు పరారయ్యాడు. ఆ ముగ్గురిని పోలీసులు తమదైన శైలిలో విచారించారు. నిందితులు తెలిపిన వివరాలతో ఫారుక్ మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి ఫారుక్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

విచారణలో వెలుగు చూసిన నిజాలు

ఫారుక్ ఫోన్ స్విచ్ఛాఫ్‌గా ఉండడంతో ఆక్టోపస్ అధికారుల ఆదేశాల మేరకు అతని కాల్ డేటాను పోలీసులు సేకరించారు. అందులో ఉన్న కాల్స్ ఆధారంగా విచారణ చేపట్టారు. ఫారుక్ ఫోన్ లొకేషన్ నంద్యాలలో ఉన్నట్లు తేలడంతో చివరగా ఫోన్ చేసిన వారిని నంద్యాల జిల్లా పోలీసులు విచారణ చేశారు. ఈ నేపథ్యంలో నంద్యాలకు చెందిన అనీషను కూడా విచారణ చేశారు. దీంతో అసలు నిజం బయటపడింది. ఫారుక్‌కు పెళ్లికాక ముందు నుంచి అనీషతో పరిచయముంది. అది వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ నేపథ్యంలో అనీష కుమార్తెతో కూడా ఫారుక్ సన్నిహితంగా ఉండడంతో ఆమె తట్టుకోలేకపోయింది. ఈ విషయమై ఫారుక్‌తో తరచూ గొడవ పడేది. ఫారుక్ నంద్యాలలోని తెలిసిన వ్యక్తి ద్వారా అనీషకు డబ్బులు పంపిస్తున్నాడు. ఆ వ్యక్తి సన్నిహితంగా ఉండడంతో అనీష కుమార్తెను పెళ్లి చేసుకుంటానని చెప్పాడు. దీంతో ఫారుక్‌ను అడ్డు తొలగిస్తేనే పెళ్లికి అంగీకరిస్తానని అనీష చెప్పింది.

మెగా ఫ్లయ్‌ఓవర్ నిర్మించాలి

- శంకర్ విలాస్ ఫ్లయ్‌ఓవర్ అంశంలో రాజకీయపార్టీలు, సంఘాల డిమాండ్
- బెటర్ శంకర్ విలాస్ ఫ్లైఓవర్ జేఏసీ ఆధ్వర్యంలో గుంటూరులో రౌండ్ టేబుల్ సమావేశం
- వైఎస్సార్ సీపీ నుంచి హాజరైన అంబటి రాంబాబు, నూరి ఫాతిమా
- ప్రజాభీష్టం మేరకు నిర్మించాలని నినాదం



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు

గుంటూరు ఎడ్యుకేషన్ : భవిష్యత్తు అవసరాలు తీర్చే విధంగా శంకర్ విలాస్ మెగా ఫ్లయ్‌ఓవర్ నిర్మాణానికి ప్రభుత్వం, అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో కృషి చేయాలని రాజకీయ, ప్రజా, వర్తక, వాణిజ్య సంఘాల ప్రతినిధులు ముక్త కంఠంతో డిమాండ్ చేశారు. శుక్రవారం 'బెటర్ శంకర్ విలాస్ ఫ్లయ్‌ఓవర్ జేఏసీ' ఆధ్వర్యంలో గుంటూరు అరండల్‌పేటలోని ఓ హోటల్లో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. జేఏసీ కన్వీనర్ ఎల్.ఎస్.భారవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వివిధ సంఘాలు, పార్టీలకు చెందిన ప్రతినిధులు పాల్గొని ఫ్లయ్‌ఓవర్ నిర్మాణంపై ప్రజల అభీష్టానికి అనుగుణంగా మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. జేఏసీ కన్వీనర్ ఎల్.ఎస్.భారవి మాట్లాడుతూ గతంలో ప్రతిపాదించిన ప్రాజెక్టును యథావిధిగా అమలు పర్చాలని కోరుతున్నామని, ప్రజల అవసరాలకు సరిపోని బ్రిడ్జిని అంగీకరించబోమన్నారు. సీపీఎం నగర కార్యదర్శి నళినీకాంత్ మాట్లాడుతూ విజన్ ఉన్న నాయకుడినని చెప్పుకునే చంద్రబాబు విజన్ లేకుండా నిర్మిస్తున్న ఫ్లయ్‌ఓవర్ నిర్మాణంపై స్పందించాలని అన్నారు. రేట్ పేయర్స్ అసోసియేషన్ నాయకుడు నారాయణరెడ్డి మాట్లాడుతూ ఆర్వోబీ నిర్మాణానికి ముందుగా ఆర్‌యూబీ నిర్మించేందుకు నిపుణులతో సాంకేతికంగా పరిశీలన జరపాలన్నారు. ప్రజా ఆలోచన వేదిక అధ్యక్షుడు మేడూరి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పీ–4 విధానాన్ని అమలు చేయడం ద్వారా ఫ్లయ్‌ఓవర్ నిర్మాణాన్ని చేపట్టవచ్చన్నారు. హైకోర్టు న్యాయవాది నర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ మెగా ఫ్లయ్‌ఓవర్ నిర్మాణానికి అవసరమైన విధంగా చేస్తున్న పోరాటంలో తాము భాగస్వాములవుతామని చెప్పారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఎండీ మస్తాన్‌వలీ, సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ఆప్ నాయకుడు టి.సేవా కుమార్, నర్రా శ్రీనివాసరావు, ఆడిటర్ పీవీ మల్లికార్జునరావు, వల్లూరు సదాశివరావు, పౌర, వర్తక, వాణిజ్య సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మెగా ఫ్లయ్‌ఓవర్ నిర్మాణాన్ని చేపట్టాలి

గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలను కలుపుతూ ప్రజల ట్రాఫిక్ అవసరాలను తీరుస్తున్న శంకర్‌విలాస్ ఆర్వోబీ స్థానంలో ప్రతిపాదించిన ఫ్లయ్‌ఓవర్‌ను మెగా ఫ్లయ్‌ఓవర్‌గా మార్చి నిర్మించాలి. సేతు బంధన ప్రాజెక్టు ద్వారా కేంద్రం మంజూరు చేసిన రూ.98 కోట్లతో సాధారణ బ్రిడ్జిగా నిర్మించడం వల్ల ప్రజల అవసరాలను తీర్చకపోగా, కొత్త సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదముంది. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని గత ఎంపీ గల్లా జయదేవ్ హయాంలో ప్రతిపాదించినట్లు హిందూ కళాశాల సెంటర్ నుంచి లాడ్జి సెంటర్ వరకు మెగా ఫ్లయ్‌ఓవర్ నిర్మాణాన్ని లక్షలాది మంది ప్రజలు కోరుతున్నారు. మెగా ఫ్లయ్‌ఓవర్‌తోపాటు ఆర్‌యూబీని నిర్మించడం ద్వారా ట్రాఫిక్ కష్టాలను తీర్చవచ్చు.

– అంబటి రాంబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలి



మెగా ఫ్లయ్‌ఓవర్ నిర్మాణం విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లాలి. నిధులు రాబట్టే దిశగా జేఏసీ చర్యలు చేపట్టాలి. రాజకీయాలకు అతీతంగా భవిష్యత్తు అవసరాల కోసమే అందరూ పని చేయాలి. ఇది గుంటూరు నగరానికి మేలు చేస్తుంది.

– షేక్ నూరి ఫాతిమా, వైఎస్సార్‌సీపీ గుంటూరు నగర అధ్యక్షురాలు

వందేళ్లు నిలిచేలా ఫ్లయ్‌ఓవర్ నిర్మించాలి



విపరీతంగా పెరిగిన ట్రాఫిక్ రద్దీని తట్టుకోవడంతో పాటు వ్యాపారస్తులకు ఇబ్బందులు లేకుండా మెగా ఫ్లయ్‌ఓవర్ నిర్మాణం దిశగా ప్రభుత్వం ప్రస్తుత ప్రాజెక్టులో మార్పులు చేయాలి. మాజీ ఎంపీ గల్లా జయదేవ్ రూ.168 కోట్లతో ప్రతిపాదించిన ఆర్‌యూబీ, ఆర్వోబీ నిర్మాణాలను చేపట్టాలి.

– కేఎస్ లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్సీ

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. **6,500** గరిష్టం : రూ. **8,600**

మోడల్ ధర రూ. **7,400**

క్లుప్తంగా

కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: నిరుద్యోగ యువతకు ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగళూరులోని కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో ఉచిత శిక్షణ, ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు సంస్థ సమన్వయకర్త హరిప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. టెన్త్ ఉత్తీర్ణతతోపాటు, ఇంటర్, డిప్లమా, డిగ్రీ పాస్, ఫెయిల్ అయిన 18 నుంచి 28 ఏళ్లలోపు నిరుద్యోగ యువత అర్హులని తెలిపారు. ట్యాలీ ప్లస్ జీఎస్టీ, కంప్యూటర్, కమ్యూనికేషన్, లైఫ్, ఇంటర్వ్యూ స్కిల్స్‌తోపాటు స్పోకెన్ ఇంగ్లిష్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్‌పై బెంగళూరులో 35 రోజుల పాటు ఉచిత భోజన, వసతితో కూడిన శిక్షణ కల్పిస్తామని పేర్కొన్నారు. శిక్షణానంతరం వివిధ సంస్థల్లో నెలకు రూ.15వేలకుపైబడిన వేతనంతో నూరుశాతం ఉద్యోగావకాశాన్ని కల్పిస్తామని, ఇతర వివరాలకు 90004 87423 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

ఉపాధి హామీ కూలీ మృతి


బల్లికురవ: ఉపాధి హామీ పథకం పనులు చేస్తుండగా ఎండ వేడిమితో అనారోగ్యం పాలై పదిరోజులపాటు వైద్యశాలలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. అందిన సమాచారం ప్రకారం.. మండలంలోని కొండాయపాలెం గ్రామానికి చెందిన తన్నీరు శ్రీనివాసరావు (45) పదిరోజుల కిందట గ్రామంలో జరిగిన ఉపాధి పనులకు వెళ్లి ఎండదెబ్బకు గురయ్యాడు. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం గుంటూరు వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య ఇరువురు కుమారులు ఉన్నారు. రెక్కాడితేకాని డొక్క నిండని ఈ కుటుంబంలో కుటుంబ యజమాని చనిపోవటంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రభుత్వపరంగా ఆదుకోవాలని బాధిత కుటుంబం వేడుకుంటుంది. అందరితో కలివిడిగా ఉండే శ్రీనివాసరావు అకాల మరణంతో కొండాయపాలెం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రిషియన్ మృతి

అద్దంకి రూరల్: విద్యుత్ స్తంభంపై నుంచి కింద పడి ఎలక్ట్రిషియన్ మృతి చెందిన సంఘటన అద్దంకి మండలంలోని చిన కొత్తపల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. మృతురాలి భార్య పులి లక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్సై రవితేజ కేసు నమోదు చేశారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని చినకొత్తపల్లి గ్రామానికి చెందిన పులి నెహేమియా (35) సుమారు 15 సంవత్సరాలుగా ఎలక్ట్రిషియన్‌గా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన జొన్నలగడ్డ రామాంజనేయులు రైస్‌మిల్లుకు కరెంట్ రాకపోవటంతో చూడటానికి వెళ్లి విద్యుత్ స్తంభం ఎక్కి చూస్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగలటంతో స్తంభం పై నుంచి కిందపడ్డాడు. స్థానికులు రామాజంనేయులు, తంగిరాల మనోహర్‌లు అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యుడు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.

కప్పం కడితే రైట్ రైట్

- గ్రానైట్‌లో వసూళ్ల దందా
- చినబాబు నెల మామూళ్లు రూ.50 కోట్లు
- అద్దంకి, పర్చూరు పచ్చనేతలకు చెరో రూ.8 వేలు
- రూ.10 వేలు డిమాండ్ చేస్తున్న గురజాల పచ్చనేత
- తనకు రూ.8 వేలు కావాలంటున్న నరసరావుపేట నాయకుడు
- కప్పం కట్టకపోతే సేల్‌టాక్స్, లోకల్ పోలీసులను ఉసిగొల్పుతున్న వైనం
- ఫ్యాక్టరీ యజమానులతో మంత్రి గొట్టిపాటి సమావేశం
- వసూళ్ల విషయం మీరే చూసుకోవాలని ఫ్యాక్టరీ యజమానులకు ఆదేశం
- తలలు పట్టుకుంటున్న పరిశ్రమల యజమానులు, బయ్యర్లు
- పచ్చ దోపిడీపై సర్వత్రా ఆగ్రహం


బల్లికురవలో గ్రానైట్ క్వారీ

సాక్షి ప్రతినిధి,బాపట్ల: కూటమి సర్కార్ దోపిడీ శృతిమించి రాగానపడింది. గ్రానైట్ పరిశ్రమల నుంచి పెద్దఎత్తున దండుకునేందుకు పచ్చనేతలు సిద్ధమయ్యారు. ప్రభుత్వానికి చెల్లించే పన్ను సంగతి దేవుడెరుగు ముందు మా సంగతి చూడమంటున్నారు. పన్ను ఎగనామం పెట్టినా ఫర్వాలేదు మాకు మాత్రం నెల మామూళ్లు ఇవ్వాల్సిందేనని హుకుం జారీచేశారు. అడిగిన మొత్తం చెల్లించకపోతే రాష్ట్ర సరిహద్దులు దాటినిచ్చేది లేదని బెదిరింపులకు దిగారు. పచ్చనేతల నెల మామూళ్లు ప్రభుత్వానికి చెల్లించే పన్ను కంటే అధిక మొత్తంలో ఉండడంతో బయ్యర్లు బెదిరిపోతున్నారు. మీకు కప్పం చెల్లించి వితౌట్(టాక్స్ లేకుండా)లో గ్రానైట్ పంపేదానికంటే ప్రభుత్వానికి పన్ను చెల్లించి దర్జాగా తీసుకెళ్లడమే మేలని వ్యాపారులు భావిస్తున్నారు.

చినబాబు కప్పం రూ.50 కోట్లు

బాపట్ల, ప్రకాశం జిల్లాల పరిధిలో ఉన్న గ్రానైట్ క్వారీలు, పరిశ్రమల నుంచి నెలకు రూ.50 కోట్లు ఇవ్వాలని చినబాబు జిల్లా గ్రానైట్ మంత్రిని ఆదేశించినట్లు సమాచారం. మంత్రి హుటాహుటిన గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానులు, బయ్యర్లతో సమావేశం పెట్టి వ్యవహారం చక్కబెట్టాలని రెండు జిల్లాల మైనింగ్ అధికారులను ఆదేశించినట్లు తెలుస్తోంది. మంత్రి ఆదేశాలతో ఇటీవల గ్రానైట్ క్వారీలు, ఫ్యాక్టరీ యజమానులతో అధికారులు తొలుత సమావేశం నిర్వహించారు. ఆ తర్వాత జిల్లా మంత్రి వారితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఒకరిద్దరికై తే కప్పం చెల్లించగలంకానీ పదుల సంఖ్యలో ఉన్న పచ్చనేతలందరికీ నెల మామూళ్లు ఇవ్వడం కుదరదని క్వారీ, పరిశ్రమల యజమానులు తేల్చి చెప్పినట్లు సమాచారం. మీరడిగినంత మొత్తం కట్టలేమని, ఇలాగైతే వ్యాపారమే మానుకుంటామని మరికొందరు వ్యాపారులు ఏకంగా మంత్రికే తేల్చిచెప్పినట్లు తెలుస్తోంది. ఇలాగైతే బయ్యర్లు పలకలు తీసుకెళ్లేందుకు ఇష్టపడరని అదే జరిగితే వ్యాపారాలు మూత పడతాయని మరికొందరు వ్యాపారులు మంత్రికి వివరించినట్లు సమాచారం. అన్నీ విన్న మంత్రి పైనుంచి వచ్చిన ఆదేశాలు పాటించడం తప్ప తాను చేయగలిగిందేమీ లేదని వ్యాపారులకు తేల్చిచెప్పినట్లు సమాచారం. దీంతో మైనింగ్, విజిలెన్స్ అధికారులు మార్టూరు, బల్లికురవ, సంతమాగులూరు, ప్రకాశం జిల్లా పరిధిలోని చీమకుర్తి ప్రాంతాల్లోని క్వారీలు, ఫ్యాక్టరీలపై దాడులకు దిగారు. పచ్చనేతల తీరుతో విసిగి పోయిన క్వారీ, పరిశ్రమల యజమానులు వితౌట్‌లో మైనింగ్ చేయడం దాదాపుగా మానుకున్నారు. కొందరు మంత్రి అనుచరులకు ముడుపులు చెల్లించి రాత్రిపూట గుట్టుచప్పుడు కాకుండా గ్రానైట్ తరలిస్తున్నట్లు సమాచారం. పచ్చనేతలకు కప్పం చెల్లించి వ్యాపారం చేయడం కంటే మానుకోవడమే మేలని కొందరు బయ్యర్లు వ్యాపారానికి తాత్కాలికంగా స్వస్తిపలికారు. ఇప్పుడు ఈ విషయం జిల్లాతోపాటు రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. భూగర్భ గనులశాఖలో ఇది మరింత చర్చనీయాంశంగా మారింది.

చినబాబు కప్పం వ్యవహారం పక్కనబెడితే స్థానిక పచ్చనేతలంతా గ్రానైట్‌పై పడ్డారు. గ్రానైట్ పాలీషింగ్ పలకలు టాక్స్ లేకుండా తీసుకెళ్లేందుకు లారీకి ఏఎమ్మార్ టోకెన్‌కు రూ.25 వేలు చెల్లించాల్సి వస్తోంది. వాస్తవానికి ఏఎమ్మార్ ఇచ్చే టోకెన్ రూ.8 నుంచి రూ.10 వేలకు మించి ఉండదు. పేరుకు ఏఎమ్మార్ చెక్‌పోస్టులు నడుపుతున్నా అనధికారికంగా పచ్చనేతలే టోకెన్ల వ్యవహారం చూస్తున్నట్లు ప్రచారం. ఇది కాకుండా గ్రానైట్ క్వారీలు, ఫ్యాక్టరీలు ఉన్న పర్చూరు, అద్దంకి పచ్చనేతలకు వ్యాపారులు నెలకు చెరో రూ.8 వేలు కప్పం కడుతుండగా నరసరావుపేట పచ్చనేత రూ.8 వేలు డిమాండ్ చేస్తున్నారు. ఇక

శృతిమించిన పచ్చనేతల మామూళ్ల దందా

గ్రానైట్ దందాకు ఆద్యుడైన గురజాల నేత తనకు రూ.10వేలు ఇవ్వాల్సిందేనని పట్టుబడుతుండగా చిలకలూరిపేట నేత మాత్రం తనకు రూ.6 వేలు చాలన్నట్లు సమాచారం. మార్టూరు, బల్లికురవ, సంతమాగులూరు ప్రాంతాల నుంచి ప్రతిరోజూ 150కి తగ్గకుండా లారీలు వితౌట్‌లో హైదరాబాద్‌కు తరలిపోతుండగా ఇందులో చిలకలూరిపేట, విజయవాడ మీదుగా 30, నరసరావుపేట, గురజాల మీదుగా 120 లారీలు వెళుతున్నట్లు సమాచారం. వీరంతా ప్రతి లారీకి కప్పం చెల్లించాల్సిందేనని బయ్యర్లకు హుకుం జారీచేశారు.


ఎగుమతికి సిద్ధంగా పలకల రాళ్లు

ఏఎమ్మార్ టోకెన్‌తోపాటు పచ్చనేతలకు ఇస్తున్న కప్పంతో కలుపుకుంటే ఒక్కో లారీకి రూ.58 వేలు ఖర్చు వస్తోంది. వాస్తవంగా ప్రభుత్వానికి టాక్స్ చెల్లించినా ఇంత మొత్తంలో ఖర్చురాదు. దీంతో బయ్యర్లు పచ్చనేతలు చెప్పిన మొత్తాన్ని చెల్లించలేమంటూ అడ్డు తిరిగినట్లు సమాచారం. ఒకవేళ ఏఎమ్మార్ టోకెన్‌కు చెల్లించే మొత్తాన్ని రద్దు చేయిస్తే పచ్చనేతలు అడిగిన మేరకు కప్పం చెల్లిస్తామని బయ్యర్లు తేల్చి చెప్పినట్లు తెలుస్తోంది.

వాహనాల తనిఖీ



రేపల్లెరూరల్: సంఘ విద్రోహశక్తుల ఆట కట్టించేందుకు పోలీస్‌శాఖ నిఘా పెంచిందని డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు చెప్పారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు శుక్రవారం ప్రధానసెంటర్‌లలో వాహనాలు తనిఖీ చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ ప్రయాణ సమయంలో వాహనచోదకులు తమ వెంట వాహన రిజిస్ట్రేషన్ పత్రాలను ఉంచుకోవాలన్నారు. ప్రతి వాహనానికి తప్పనిసరిగా ఇన్సూరెన్స్‌లు చేయించుకోవన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపరాదని సూచించారు. వాహనాలలో మాదక ద్రవ్యాలను అక్రమంగా రవాణా చేయరాదన్నారు. నిత్యం తనిఖీలు ఉంటాయని అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట పట్టణ సీఐ మల్లికార్జునరావు, సిబ్బంది ఉన్నారు.

కొమర్నేనివారిపాలెంలో చోరీ



పర్చూరు(చినగంజాం): మండలంలోని కొమర్నేనివారిపాలెంలో శుక్రవారం దొంగతనం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఎర్రా వెంకట సుబ్బయ్య ఇంటిలో దుండగులు దొంగతనానికి పాల్పడ్డారు. బీరువాలో ఉన్న 10 సవర్ల బంగారం, రూ.14 వేలు నగదు, ఒక టీవీని అపహరించుకొని వెళ్లారు. గ్రామంలో శుభకార్యం జరుగుతున్న సమయంలో ఇంటిలోకి దొంగలు ప్రవేశించి దొంగతనానికి పాల్పడ్డారు. ఇంటికి వచ్చిన వెంకట సుబ్బయ్య తలుపులు తీసి ఉండటం, ఇంటిలోని బీరువాలోని బట్టలు చిందరవందరగా పడి ఉండటంతో తన ఇంటిలో దొంగతనం జరిగిందని గుర్తించి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటనా స్థలానికి హుటాహుటిన చేరుకున్న ఎస్‌ఐ మాల్యాద్రి ఇంటి పరిసరాలను పరిశీలించి, క్లూస్‌టీంను పిలిపించి వివరాలను సేకరించారు. బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు సంఘటనా స్థలాన్ని సందర్శించి పరిశీలించారు.

రాష్ట్ర హజ్‌కమిటీ ఛైర్మన్ ఎంపికపై నిరసన

- హసన్‌బాషా ఎంపికకు వ్యతిరేకంగా వీడియో వైరల్
- టీడీపీ సీనియర్ మైనార్టీ నాయకుల్లో అసంతృప్తి

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ పదవి గుంటూరుకు చెందిన హసన్ బాషాకు కట్టబెట్టడంపై జిల్లావ్యాప్తంగా ఉన్న తెలుగుదేశం పార్టీ సీనియర్ మైనార్టీ నాయకులు మండిపడుతున్నారు. పార్టీ జెండాను కాళ్లతో తొక్కి, తగులబెట్టిన హసన్‌బాషాకు పదవి ఇవ్వడం సరికాదంటూ సీనియర్ మైనార్టీ నాయకుడు, టీడీపీ జిల్లా కార్యదర్శి షంషేర్ జాదా ఆవేదన వ్యక్తం చేస్తూ చిత్రీకరించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. పవిత్ర హజ్ కమిటీ చైర్మన్ పదవికి హసన్ అర్హుడు కాదంటూ పలువురు మైనార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ వీడియో ఎమ్మెల్యేలతోపాటు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్‌లతోపాటు మైనారిటీ మంత్రి ఫారుఖ్ వద్దకు చేరినట్లు సమాచారం. ఈ వీడియోలో హసన్ బాషా 2014 ఎన్నికల సమయంలో రూ.5 వందలు ఇవ్వలేదని పార్టీ జెండాలను, తోరణాలను కాళ్లతో తొక్కి తగులబెట్టినట్లు జాదా విమర్శించారు. హసన్ నియామకంపై తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌ను ప్రశ్నించానని, అయితే ఎంపికలో తన ప్రమేయం లేదని ఆయన చెప్పినట్లు జాదా పేర్కొన్నారు. ఇదిలా ఉంటే తూర్పు ఎమ్మెల్యే నసీర్ అంజుమన్-ఎ-ఇస్లామియా అధ్యక్షుడిగా, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్‌గా ఇప్పుడు హజ్ కమిటీ సభ్యుడిగానూ పదవులు పొందడంపై మైనార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. హజ్ కమిటీ చైర్మన్ పదవిని కూడా మంచి వ్యక్తికి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

మార్టూరులో మరో చోరీ

మార్టూరు: వరుస దొంగతనాల మార్టూరు మండలం ప్రజలు బెంబేలెత్తుతున్నారు. తాజా శుక్రవారం తెల్లవారుజామున మార్టూరులో స్థానిక జాతీయ రహదారి పక్కన గల ఎంఆర్‌ఎఫ్ టైర్ల షోరూమ్‌లో చోరీ జరిగింది. షోరూం యజమాని కొల్లా రాము తెలిపిన వివరాలు... గురువారం రాత్రి వ్యాపార లావాదేవీల అనంతరం రూ.50 వేల నగదును క్యాష్ కౌంటర్లో ఉంచి యధా ప్రకారం షట్టర్ తాళం వేసి ఇంటికి వెళ్లారు. శుక్రవారం తెల్లవారుజామున మూడున్నర గంటల సమయంలో మొహం కనిపించకుండా మాస్క్ ధరించిన ఓ గుర్తు తెలియని ఆగంతకుడు షోరూం షట్టర్ తాళం ధ్వంసం చేసి లోనికి ప్రవేశించాడు. నేరుగా క్యాష్ కౌంటర్ వద్దకు వెళ్లి అందులోని రూ.50వేల నగదు తీసుకెళ్లాడు. సమీపంలో ఉన్న యజమాని రాముకు చెందిన పాత బట్టల కవర్‌ను సైతం ఆగంతకుడు తీసుకొని వెళ్లిపోయాడు. తెల్లవారిన తర్వాత షట్టర్ తెరచి ఉండడం గమనించిన స్థానికుల సమాచారంతో షోరూం యజమాని రాము పోలీసులకు సమాచారం అందించాడు. రాముతో కలిసి షోరూమ్ లోని సీసీ కెమెరాను పరిశీలించిన పోలీసులు నిందితుడు ఆనవాళ్లను గమనించారు. రాము సమాచారంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సీసీ కెమెరాలో చోరీ జరిగిన తీరును గమనించిన షోరూమ్ యజమాని రాము ఇది ఖచ్చితంగా తెలిసిన వారి పనేనని తెలిపారు.

పాల వ్యాన్ బోల్తా

జె.పంగులూరు: సురభి డెయిరీకి చెందిన పాల వ్యాను శుక్రవారం ఉదయం మండలంలోని చందలూరు, తూర్పు కొప్పెరపాడు గ్రామాల మధ్య అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న మార్జిన్‌లో బోల్తా పడింది. మండలంలోని జాగర్లమూడి వారి పాలెం వద్ద గల సురభి డెయిరీ నుంచి వాహనం పాల పదార్థాలతో చందలూరు మీదుగా చీరాల వెళ్లేందుకు బయలు దేరింది. తూర్పు కొప్పెరపాడు దాటిన తర్వాత ఎదురుగా ఒక కారు రావడంతో ఆ కారు వెళ్లేందుకు దారి ఇస్తూ పక్కకు రావడంతో అదుపు తప్పి మార్జిన్‌లో పడిపోయింది. ఈ ప్రమాదంలో పాల వాహనంలో ఉన్న ఎస్ కళ్యాణ్ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికులు 108 కు సమాచారం ఇవ్వడంతో అతన్ని అద్దంకి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలి



నినాదాలు చేస్తున్న ముస్లిం మత పెద్దలు

- తెనాలిలో నిరసన శాంతి ర్యాలీ
- పెద్ద సంఖ్యలో హాజరైన ముస్లింలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు

తెనాలిఅర్బన్: వక్ఫ్ ఆస్తులను కేంద్ర ప్రభు త్వం స్వాధీనం చేసుకునే కుట్ర చేస్తుందని పలువురు ముస్లిం మత పెద్దలు ఆరోపించారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ మజ్లిసుల్ ఉలమా వల్ అయిమ్మా జమీయతే ఉలమా యే హింద్ లౌకిక వాదులు, దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తెనాలి పట్టణంలో శుక్ర వారం మధ్యాహ్నం నిరసన, శాంతి ర్యాలీని నిర్వ హించారు. వహాబ్‌చౌక్ నుంచి ప్రారంభమైన ర్యాలీ సత్యనారాయణ టాకీస్, బోసు రోడ్డు, శివాజీచౌక్ వరకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి మతానికి సమానమైన హక్కులు, ప్రాతినిధ్యాన్ని రాజ్యాంగం కల్పించిందని పేర్కొన్నారు. రాజ్యాంగానికి విరుద్ధంగా ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసిన వక్ఫ్ బోర్డును కేంద్ర ప్రభుత్వం సవరణ చేయడం రాజ్యాంగ విలువలను కాలరాయడమేనని ఆరోపించారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం స్పందించి వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర స్పందించకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ముస్లిం మతపెద్దలు, వివిధ సంఘాల ముస్లిం నాయకులు, వైఎస్సార్ సీపీ, టీడీపీ, సీపీఐ, సీపీఎం, ఎస్ఎఫ్ఐ, ఎమ్మార్పీఎస్, వివిధ ప్రజా సంఘాలు, దళిత సంఘాలు, క్రైస్తవ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆద్యంతం.. సందేశాత్మకం

ఉత్సాహంగా నాటికల పోటీలు


ఇది అతని సంతకం నాటికలో సన్నివేశం

తెనాలి: డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి స్మారక నాటక కళాపరిషత్, తెనాలి ఆధ్వర్యంలో ఇక్కడి రామలింగేశ్వర పేటలోని ఓపెన్ ఆడిటోరియంలో జరుగుతున్న జాతీయస్థాయి చతుర్థ ఆహ్వాన నాటికల పోటీల్లో భాగంగా చివరిరోజైన శుక్రవారం రెండు నాటికలను ప్రదర్శించారు. తొలుత అభినయ ఆర్ట్స్, గుంటూరు వారి 'ఇది అతని సంతకం' నాటికను ప్రదర్శించారు. ప్రతి మనిషి జీవితంలో ఒక గోల్ ఉంటుంది. నిర్దిష్ట ప్రణాళిక ఉంటుంది. సమస్యలను వాటిని ఆచరణలో పెట్టి సాధించుకునేవారి జీవితం పరిపూర్ణమవుతుంది. రాజీపడితే ఆ మనిషి వ్యక్తిత్వం మరణిస్తుంది. సమయస్ఫూర్తితో ఇంటాబయటా నెగ్గుకురాగలిగినవాడే నిజమైన యజమాని అవుతాడు అనే సందేశాన్ని చాటిందీ నాటిక. స్నిగ్ధ రచించిన ఈ నాటికను ఎస్.రవీంద్రరెడ్డి దర్శకత్వంలో ప్రదర్శించారు. ప్రధానమైన కృష్ణమూర్తి పాత్రలో దర్శకుడు ఎస్.రవీంద్రరెడ్డి నటించారు. ఇతర పాత్రల్లో వీసీకేహెచ్ ప్రసాద్, ఎన్.సూర్య, టి.శ్రీలేఖ, కుసుమసాయి నటించారు. సంగీతం లీలామోహన్.

తల్లీబిడ్డల అనుబంధం 'దేవుడు కనిపించాడు'..

చివరగా శ్రీసాయికార్తిక్ క్రియేషన్స్, కాకినాడ వారి 'దేవుడు కనిపించాడు' నాటికను ప్రదర్శించారు. తల్లీబిడ్డల అనుబంధాన్ని చాటిందీ నాటిక. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను అనాథలుగా వదిలేస్తున్న కొడుకుల కథలను వింటున్న నేటిరోజుల్లో తాను చనిపోతానని తెలిసీ, తల్లికి ఆసరా కోసం కొడుకు పడే వేదన, ఆపరేషన్ చేస్తే ప్రాణానికే ప్రమాదం అని తెలిసినా, కొడుకు కోసం కిడ్నీనే దానం చేసి, కొడుకు ప్రాణాలను దక్కించుకోవటానికి తల్లి పడే ఆవేదనను కళ్లకు కట్టిందీ నాటిక. ఊపిరున్నంతవరకు విడదీయలేనివీ అనుబంధాలు మరచిపోకూడదన్న సందేశాన్నిచ్చిందీ నాటిక. డాక్టర్ సింహప్రసాద్ మూలకథకు మార్కొండ దుర్గాప్రసాద్ నాటకీకరించారు. చత్రా విజయలక్ష్మీ మహేష్ దర్శకత్వం వహించారు. ప్రధాన పాత్రల్లో శ్రీలేఖ, సీహెచ్ మహేష్, డి.రఘుబాబు, మార్కొండ దుర్గాప్రసాద్, ఎన్.కృష్ణకాంత్, కొప్పుల శ్రీనివాసరావు నటించారు. సంగీతం రమణ. తొలుత నృత్యగురువులు ఆలపాటి ప్రజ్ఞ, చిలకలపూడి ముకుందప్రియ శిష్యబృందాలు కూచిపూడి నృత్యాంశాలను ప్రదర్శించారు. తెనాలి కళాకారుల సంఘం నిర్వహణలో జరిగిన ఈ నాటికల పోటీలను గౌరవాధ్యక్షుడు ఆరాధ్యుల కన్నా, అధ్యక్షుడు అద్దేపల్లి లక్ష్మణశాస్త్రి పర్యవేక్షించారు.

70 గ్రాముల బంగారం చోరీ

కాజ(మంగళగిరి): కాజ రామాలయం సెంటర్‌లో చోరీ ఘటన చోటు చేసుకుంది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. కాజ రామాలయం సెంటర్‌లో ఉంటున్న ఆర్థల నిర్మల కుమారుడు, కుమార్తెలు హైదరాబాద్‌లో ఉంటున్నారు. నిర్మల 15 రోజుల క్రితం హైదరాబాద్ వెళ్లింది. గురువారం సాయంత్రం ఇంటి పక్కన ఉన్న వారు చూడగా తలుపులు తీసి ఉన్నట్లు చూసి హైదరాబాద్ ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. దీంతో శనివారం హైదరాబాద్ నుంచి కాజ చేరుకుని ఇంటిలోకి వెళ్లి చూడగా బీరువా తాళాలు పగలగొట్టి అందులోని బంగారం బిస్కెట్లు ఐదు, కొన్ని బంగారు వస్తువులు మొత్తం 70 గ్రాములు బంగారం చోరీకి గురైందని తెలుసుకున్నారు. రూరల్ స్టేషన్‌కు చేరుకుని నిర్మల ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పొగాకు రైతులను ఆదుకోవాలి


పెదనందిపాడులో పొగాకును పరిశీలిస్తున్న రైతు, కౌలురైతు సంఘ నాయకులు

కాకుమాను: ఈ ఏడాది పొగాకు సాగు చేస్తున్న రైతులందరినీ ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘ రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య డిమాండ్ చేశారు. పెదనందిపాడులో రైతులు పండించిన పొగాకును కృష్ణయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతేడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది ధర సగానికి సగం తగ్గిందని ఆవేదన చెందారు. ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రైతుల కష్టాలు పట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధరల స్థిరీకరణ నిధికి ప్రభుత్వం రూ.300 కోట్లు మాత్రమే కేటాయించిందని కనీసం రూ.5వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. పొగాకు రైతుల నుంచి పంటను రూ.18వేలకు కొనాలని కోరారు. కార్యక్రమంలో కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు, రైతుసంఘం జిల్లా కార్యదర్శి అజయ్ కుమార్, కౌలురైతు సంఘం బాపట్ల జిల్లా నాయకులు గంగయ్య, జిల్లా సహాయ కార్యదర్శి వెకటశివరావు, దొప్పలపూడి రమేష్ బాబు పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీ కొట్టిన మారో లారీ

క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్

అద్దంకి: ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొట్టిన ఘటనలో క్యాబిన్‌లో డ్రైవర్ ఇరుక్కుపోయిన సంఘటన మండలంలోని శింగరకొండ వద్ద నామ్ రహదారిలో శుక్రవారం జరిగింది. అందిన సమాచారం మేరకు నాగార్జున సిమెంటు కంపెనీ నుంచి డ్రైవర్ నరేంద్ర లారీలో సిమెంటు లోడు చేసుకుని ఒంగోలు బయలుదేరాడు. ఈ క్రమంలో లారీ శింగరకొండకు సమీపంలోకి రాగానే అదుపు తప్పి ముందు ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. దాంతో లారీ క్యాబిన్ లోపలికి చొచ్చుకుపోవడంతో డ్రైవర్ అందులో ఇరుక్కుపోయాడు. సమాచారం అందుకున్న ఎస్సై రవితేజ హుటాహుటిన అక్కడకు చేరుకున్నాడు.

108 సిబ్బంది అక్కడికి చేరుకుని, క్యాబిన్‌లో నుంచి డ్రైవర్‌ను బయటకు తీసేందుకు రెండు గంటలపాటు కష్టపడ్డారు. ఎట్టకేలకు పొక్లెయిన్‌తో జాగ్రత్తగా క్యాబిన్‌ను వెనుక్కు వచ్చే విధంగా చేసి డ్రైవర్‌ను బయటకు తీశారు.


లారీ నుంచి డ్రైవర్‌ను బయటకు తీస్తున్న పోలీసులు, 108 సిబ్బంది

తీవ్ర గాయాలపాలైన డ్రైవర్‌ను 108 వాహనంలో ఒంగోలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. క్యాబిన్‌లో డ్రైవర్ ఒక్కడే ఉండడం, అతను అపస్మారక స్థితిలో ఉండడంతో అతని వివరాలు తెలియరాలేదు.